


12 వేల మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా తొలి రోజు 28 వైద్య శిబిరాలు నిర్వహించి 12,171 మందికి ఒపి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్ .భాస్కర రావు తెలిపారు. దీనిలో 11,659 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. 622 మందిని తదుపరి చికిత్స కోసం పై స్థాయి ఆసుపత్రులకు సిఫారసు చేశారని తెలిపారు. జనరల్ విభాగంలో 5139, అధిక రక్తపోటుకు సంబందించి 1825, మధుమేహంకు సంబంధించి 1507, ప్రసూతి సమస్యలపై704 మందికి, చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలపై 659, చెవి ముక్కు గొంతు వ్యాధులకు సంబంధించి 323, జ్వరాలకు సంబంధించి 243, కంటి సమస్యలపై 1775 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

సిట్టింగుల్లో గుబులు



- సిఎం జగన్ మాటలతో అయోమయం
- పైపైన గంభీరం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాటలు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో గుబులు పుట్టిస్తున్నాయి. చాలా వరకు వారిలో అయోమయ పరిస్థితి కనిపిస్తున్నప్పటికీ పైకి మాత్రం గంభీరం ప్రదర్శిస్తూ సీట్లపై దీమా వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా కొంతమంది సిట్టింగులకు ఉద్వాసన తప్పదని వైసిపి అధినేత జగన్ చాలా క్లారిటీగానే చెప్పిన విషయం తెలిసిందే. పార్టీ అధినేత తన క్యాంపుకార్యాలయంలో ఇటీవల ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్య నాయకులతో సమీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో వచ్చే ఎన్నికలు, సీట్ల కేటాయింపు తదితర అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా 'మీలో చాలా మందికి మళ్లీ టిక్కెట్లు రావచ్చు. కొంతమందికి ఇవ్వలేకపోవచ్చు. టిక్కెట్ వచ్చినా, రాకపోయినా మీరు నా మనుషులే. ఎన్నికల్లో తప్పులు జరక్కూడదని తీసుకున్న నిర్ణయాలకు అందరూ సహకరించాలి' అంటూ జగన్ స్పష్టం చేశారు. దీంతో, సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఈ సారి ఎన్నికల్లో ఎవరిని బరి నుంచి తప్పిస్తారో? అన్న అసక్తికర చర్చ కూడా ఎమ్మెల్యేలతోపాటు వారి అనుయాయులు, కార్యకర్తల్లోనూ మొదలైంది. విజయనగరం జిల్లాలో ఏడు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. వీరిలో కొంతమంది పనితీరు బాగోలేదని కూడా గతంలో సిఎం పరోక్షంగా హెచ్చరించిన సంగతి తెలిసిందే. వీరిలో ఈసారి మంత్రులిద్దర్నీ ఎంపీలుగా పోటీ చేయించే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్టుగా కూడా చాలా కాలంగా చర్చనడుస్తోంది. ఈ సంగతి కాస్త పక్కనబెడితే సిట్టింగుల్లో పార్టీ అధినేత జగన్ సర్వేలో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయనేది ఇంకా బహిర్గతం కాలేదు. ఈ మాటకొస్తే కేవలం పనితీరు ఒక్కటే ప్రమాణికం కాదని, సంబంధిత నియోజకవర్గాల్లో ప్రజల స్పందన, ఆయా ఎమ్మెల్యేలను అభిమానించడం లేదా అసంతృప్తి వ్యక్తం చేయడం వంటివన్నీ పరిణగనలోకి తీసుకుంటారని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని రాజకీయ పరిస్థితులను భేరీజు వేస్తే గతం మాదిరిగా వైసిపికి వన్‌వే కనిపించడం లేదు. కొన్ని నియోజకవర్గాల్లో ముఖ్యంగా గజపతినగరం, నెల్లిమర్ల, కురుపాం, బొబ్బిలి, రాజాం, పాలకొండ, ఎచ్చెర్ల, విజయనగరం నియోజకవర్గాల్లో పార్టీ పథకాలపై తప్ప, స్థానిక ఎమ్మెల్యేలపై ప్రజలేమీ అంత సంతృప్తికరంగా లేరని అదే రాజకీయ పార్టీకి చెందిన నాయకులే విశ్లేషిస్తున్నారు. అటు ఎస్.కోటలో పార్టీకి కొంత అనుకూలంగా వున్నప్పటికీ అంతర్గత విభేదాలు తారా స్థాయికి చేరాయి. కార్యకర్తలకన్నా నాయకులే ఎక్కువగా ఉండడం ఇందుకు కారణం. పార్వతీపురం ఎమ్మెల్యే జనంలో తలలో నాలుకలా ఉన్నప్పటికీ ప్రతిపక్షం తీసుకునే రాజకీయ వ్యూహాన్ని బట్టి ఆయనకు అనుకుల, ప్రతికూల పరిస్థితులు అంచనా వేయడం సాధ్యమౌతుంది. పార్టీ ఇచ్చిన పిలుపుల్లో భాగంగా ప్రజల్లో తిరగడంలో మాత్రం వీరిలో ఎవరూ పెద్దగా వెనుకబడినట్టుగా కనిపించడం లేదు. ఈనేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో సీట్ల విషయమై అధినేత అంతర్గత సర్వేపై ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది. మొత్తంగా ఈ రెండు జిల్లాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో టిక్కెట్ల గండం ఎవరికి ఉందనేది సంక్రాంతి వరకు బయటపడే అవకాశాలు లేవని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. టిక్కెట్లు రావనే విషయం ముందస్తుగానే బహిర్గతం చేస్తే అసంతృప్తితో పార్టీకి నష్టం చేకూరే నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకుండా పార్టీ అధిష్టానం చాకచక్యంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. అందుకే ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా అందరూ తన మనుషులే అన్న విధంగా భావిస్తానంటూ పార్టీ అధినేత జగన్ చెప్తున్నారని పలువురు గుర్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఫ్యాప్టో డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక (ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. ఆదివారం లక్క పందిరి వీధిలోని ఎపిటిఎఫ్ భవనంలో ఫ్యాప్టో సమావేశం జరిగింది. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పర్యటన అనంతరం జిల్లాలో పలువురు ఉపాధ్యాయులకు చిన్న చిన్న కారణాలు ఎత్తి చూపుతూ, మెమోలు, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్లు జారీ చేయడంపై చర్చించారు. తక్షణమే ఉపాధ్యాయుల సస్పెన్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. ఈ అంశాలపై భవిష్యత్తులో ఉమ్మడి ఐక్య కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. విద్యాశాఖ మంత్రిని కలసి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానం చేశారు. సమావేశంలో ఎపిటిఎఫ్ (257) నాయకులు పి.శ్రీనివాసరావు, పిఆర్ టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఎస్‌టియు నాయకులు డి.శ్యామ్, ఆప్టా నాయకులు వి.జమెనా, ఎస్.భాస్కరరావు ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదు

ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. సస్పెన్షన్ కు గురైన ఉపాధ్యాయులను ఆదివారం ఆయన కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ప్రవీణ్ ప్రకాష్ స్కూల్స్ విజిట్స్ సందర్భంగా చిన్న చిన్న విషయాలకు సస్పెన్షన్‌కు గురి చేయడం సరికాదన్నారు. అధికారులు విజిట్ చేసే సందర్భంలో ఏమైనా చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే డిపార్ట్మెంట్ పరంగా అంతర్గతంగా సమావేశం ఏర్పాటు చేసుకొని , చర్చించుకొని సరి చేయాలి తప్ప ఈ విధంగా ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడం తగదన్నారు. ఆయన వెంట పిఆర్‌టియు అర్బన్ కార్యదర్శి చిట్టి రామునాయుడు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, పిఆర్‌టియు నాయకులు కరుణ్, రమేష్ తదితరులు ఉన్నారు.



అభివాదం చేస్తున్న ఫ్యాప్టో నాయకులు



మాట్లాడుతున్న డిపో మేనేజర్

బస్ టైర్ల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం కోట

బస్ టైర్ల సంరక్షణ అందరి బాధ్యతని విజయనగరం ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. టైర్ల సంరక్షణ పక్షోత్సవాలలో భాగంగా ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ గ్యారేజ్‌లో సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి రెండుసార్లు టైర్ల గాలిని పరీక్షించాలని, టైరు బటన్ మధ్యలో ఉన్న రాళ్లను ప్రతిరోజు తొలగించాలని, టైర్ మెకానిక్ డిఫెక్టను సరిచేయాలని, పంచర్ అయినా టైర్ స్థానంలో కొత్త టైర్ ను వెంటనే అమర్చుకోవాలని సూచించారు. రోడ్డు కండిషన్ బట్టి బస్సు నడపాలని, సడన్ బ్రేకులు వంటివి వేయరాదని అన్నారు. ఈ ప్రమాణాలు పాటిస్తే టైర్ల మైలేజీ పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు, బహుమతులతో విద్యార్థులు

ఘనంగా బిఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

భారత సంచార నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) 24వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఆ సంస్థకార్యాలయంలో ఘనంగా జరిగింది. డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జన మేనేజర్ శ్రీనివాసరావు, మురళీధర్ జగదీష్‌తో పాటు బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు. డిజిఎం దాలి నాయుడు తొలుత కేకును కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి అందరూ సహకరించాలని, వినియోగదారులకు నాణ్యమైన సర్వీసులు అందించాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మొదట బహుమతి పొందిన వారికి 4జి సిమ్‌కార్డ్ ఏడాది కాలపరిమితితోను, రెండో బహుమతి పొందిన విద్యార్థికి 6 నెలలు కాల పరిమితితో, తృతీయ బహుమతి పొందిన విద్యార్థికి మూడు నెలలు కాలపరిమితితో పనిచేసే 4 జి సిమ్‌ను అందజేశారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రంతో పాటు 75 మంది విద్యార్థులకు 4జి సిమ్‌లు అందజేశారు. కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి అలుగు వెంకట్రావు, ఎన్ఎఫ్‌టిఇ జిల్లా కార్యదర్శి అప్పారావు, బిటిఇయు కార్యదర్శి మాలిక్ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌కు వెంటనే 5జి సర్వీసులు ఇవ్వాలని అలుగు వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు.

కాలం చెల్లిన వాహనాలకు అనుమతి లేదు

డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జిఆర్ రవీంద్రనాథ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో కాలం చెల్లిన వాహనాలు తిరిగేందుకు అనుమతి లేదని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జిఆర్ రవీంద్రనాథ్ తెలిపారు. ప్రైవేటు టాక్సీ బోర్డు వాహనాలకు వాహన చట్టం ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి వాహన సామర్థ్య పరీక్ష నిర్వహించి వాహనం నడిపేందుకు అనుమతి జారీ చేస్తున్నామని చెప్పారు. ఫిట్‌నెస్‌లేకుండా పాఠశాల బస్సులు తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు.



? జిల్లాలో ఎన్ని వాహనాలు ఉన్నాయి?

జిల్లాలో మొత్తంగా అన్ని రకాల వాహనాలు కలిపి 3లక్షల 95వేల 664 వాహనాలు ఉన్నాయి. వీటిలో ద్విచక్ర వాహనాలు 3,57,883, త్రిచక్ర వాహనాలు 8780, ఫోర్‌వీలర్స్ వాహనాలు (కార్లు, బస్సులు, లారీలు) 29,001 ఉన్నాయి.

? జిల్లాలో బడి బస్సులెన్ని? ఏటా ఫిట్‌నెస్ ఉంటేనే రెన్యువల్ చేస్తున్నారా?

జిల్లాలో మొత్తంగా ప్రైవేటు స్కూళ్లకు సంబంధించిన బస్సులు 440 ఉన్నాయి. వాటిలో ఈ ఏడాది 356 బస్సులు రెన్యువల్ అయ్యాయి. అన్ని విధాలా బస్సులు ఫిట్ అయితేనే రెన్యువల్ చేస్తున్నాం. ఏవైనా బస్సులు రెన్యువల్ కాకుండా తిరుగుతున్నట్లు తమకు సమాచారం ఉంటే సీజ్ చేయడంతో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం.

? డ్రైవింగ్ లైసెన్సింగ్ విధానాలో వచ్చిన మార్పులు గురించి వివరించండి?

లైసెన్సింగ్ జారీ ప్రక్రియంతా వాహన సారధి వెబ్‌సైట్ ద్వారా మాత్రమే జరుగుతోంది. ఇది నేషనల్ సర్వర్. కార్డులు జారీ ప్రక్రియ నిలిచిపోయింది. అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతోంది. లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న తరువాత గతంలో మాదిరి కార్డుల ఇచ్చే ప్రక్రియను ప్రభుత్వం నిలిచిపోయింది. అంతా ఆన్‌లైన్‌లోనే మంజూరు జరుగుతోంది. డిజి లాకర్ యాప్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

? కాలం చెల్లిన వాహనాల రెన్యువల్‌కు అనుసరిస్తున్న పద్ధతి ఏమిటి?

ప్రభుత్వ వాహనాలకు 15ఏళ్లు నిండిన తరువాత రెన్యువల్‌కు అనుమతి లేదు. అలాంటి వాహనాలన్నింటికీ రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. ప్రైవేటు టాక్సీ బోర్డు వాహనాలకు వాహన చట్టం ప్రకారం ప్రతి రెండేళ్లకు ఒకసారి వాహన సామర్థ్య పరీక్ష నిర్వహించి వాహనం నడిపేందుకు అనుమతి జారీ చేస్తున్నాం.

? అధికలోడుతో ప్రయాణిస్తున్న వాహనాలకు ఏ విధంగా చలానా వేస్తున్నారు?

అధికలోడుతో ప్రయాణిస్తున్న వాహనాలకు ప్రభుత్వం చలానా రూ.20వేలు విధిస్తున్నాం. ప్రయాదాలు జరగకుండా నివారిస్తున్నాం.

? రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల వద్ద ఏజెంట్ల వ్యవస్థ పెచ్చుమీరుతోంది. నివారణకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?

లైసెన్సు ప్రక్రియంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతోంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లైసెన్సులు జారీ చేస్తున్నాం. ఏజెంట్ల వ్యవస్థను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నాం.

? రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు?


వర్షాకాలంలోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బి శాఖ అధికారులతో మాట్లాడి రోడ్ల మరమ్మతుల గురించి చర్చలు జరుపుతున్నాం.

? సెల్‌ఫోన్ డ్రైవింగ్ నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్‌చేసే వారికి రూ.2వేలు జరిమానా విధిస్తున్నాం. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాటి నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

? నంబరు ప్లేట్లు లేకుండా, ఉన్నా సరిగా అంకెలు లేకపోవడం జరుగుతోంది. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

నెంబరు ప్లేట్లు లేని వాహనాలకు రూ.2వేలు జరిమానా విధిస్తున్నాం. నెంబరు ప్లేట్ వినియోగించి గురించి అవగాహన కల్పిస్తున్నాం. పోలీసుశాఖతో సమన్వయం చేసుకుంటూ నెంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలను తనిఖీ చేసి జరిమానా విధిస్తున్నాం.



? డ్రైవింగ్ స్కూల్స్‌కు ఇటీవల నోటీసులు ఇచ్చారు. వారినుంచి స్పందన ఏమిటి?

నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్ స్కూల్స్ నడుపుతున్న యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశాం. ఇప్పటికే చాలా డ్రైవింగ్ స్కూల్స్ యజమానులు తమ లోపాలను సరి చేసుకున్నారు. ఇంతవరకు ఎవరి లైసెన్సును రద్దు చేయలేదు.

పోలీసు స్పందన రద్దు

ప్రజాశక్తి-విజయనగరం

గాంధీ జయంతి నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే 'స్పందన' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. ప్రభుత్వ సెలవు దినం కావడంతో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా గమనించాలని కోరారు.

1104 యూనియన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం విజయనగరం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.అప్పారావు, వై.మంగారాజు ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా రీజనల్ అధ్యక్షులు వి. లక్ష్మణ్, డి.రాజేంద్ర ప్రసాద్ లు వ్యవహరించారు.

చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులుగా సిరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు (చిన్న శ్రీను) సోల్జర్స్ అధ్యక్షులుగా ఆయన కుమార్తె సిరి సహస్ర, ట్రెజరర్‌గా ఆయన కుమారుడు మజ్జి సాయి మోహిత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి పేరు మీద ఉన్న ఈ సంస్థకు అన్ని విధాలా, అన్ని వేళలా తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మంచిని పెంచడమే ఈ సోల్జియర్స్ నినాదమని సిరి సహస్ర అన్నారు. జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అనంతరం వికలాంగుడు పులిగెడ్డ వారి వీధికి చెందిన పాత్రో వెంకటరావుకు ట్రై సైకిల్ అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

స్వచ్ఛతా హాయ్ సేవ కార్యక్రమంలో జెడ్‌పి చైర్మన్



చీపురుపల్లి సిహెచ్‌సి ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి-చీపురుపల్లి

పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పిచ్చి మొక్కలను, వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛత కార్యక్రమంలో ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ రాజ్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి నిర్మలాదేవి, ఎంపిపి ఇప్పిలి వెంటక నర్సమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉప సర్పంచ్ బెల్లాన శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఎస్‌బిఐ ఆధ్వర్యాన..

విజయనగరం కోట : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా భారతీయ స్టేట్ బ్యాంకు అధికారులు శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో పరిసరాలను శుభ్రపరిచారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. అప్పల నాయుడు, ఎల్.డి.ఎం. శ్రీనివాస రావు, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛతా హాయ్ సేవా కార్యక్రమాన్ని ఎంపిపి అంబళ్ల సుధారాణి ఆధ్వర్యాన చేపట్టారు. అనంతరం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎంపిడిఒ జి.రామారావు, తహశీల్దారు డి.ధర్మరాజు, ఎపిఎం ఎల్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. మిమ్స్ వైద్య కళాశాల, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మిమ్స్ డీన్ లక్ష్మీకుమార్, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, మెడికల్ డైరెక్టర్ రఘురాం, అకడమిక్ డైరెక్టర్ వేణుగోపాల్, ఎఒ గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి పంచాయతీలో సర్పంచ్ మదిన లక్ష్మి ఆధ్వర్యాన శ్రమదానం చేపట్టారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి సన్మానం చేశారు.

మెరకముడిదాం : మండలంలో బైరిపురంలో సర్పంచ్ పప్పల విజయకుమారి, ఉపసర్పంచ్ పప్పల క్రిష్ణమూర్తి, వైస్ ఎంపిపి కందుల పార్వతి ఆధ్వర్యాన స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పప్పల గ్రహణేశ్వరరావు, కందుల మల్లికార్జునరావు, సెక్రటరీ దామోదర్ పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలో ఎంపిపి డి.సత్యవంతుడు ఆధ్వర్యాన స్వచ్ఛత ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ చినరామునాయుడు, తదితరులు పాల్గొన్నారు. సింగరాయి గ్రామంలో సర్పంచ్ ఎన్.వెంకటరావు ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేపట్టారు. సెక్రటరీ కన్నంనాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఆర్‌టిసి డిపోలో డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. కోర్టు ఆవరణలో సిఐ బాల సూర్యారావు, ఎస్‌ఐలు తారకేశ్వరరావు, లోవరాజు, ఆధ్వర్యాన శ్రమదానం చేపట్టారు. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒ శేషుబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు.



రిబ్బన్ కట్ చేసి రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

బిటి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని గంటస్తంభం నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు రూ.1కోటి రెండు లక్షలతో నిర్మించిన బిటి రోడ్డును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. అనంతరం ఫ్లోర్ లీడర్ ఎస్ వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు మీడియాతో మాట్లాడుతూ నగర సుందరీకరణకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఇప్పటికే నగరంలోని అనేక ప్రధాన రహదారులను విస్తరించి ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. గణేష్ కోవెల నుండి ఎస్‌బిటి మార్కెట్ వరకు, మయూరి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు, ఆర్అండ్‌బి నుండి పాల్ నగర్ వరకు ఇలా అనేక రహదారులు నూతనంగా నిర్మించి ప్రజలకు సౌకర్యవంతమైన సేవలను అందిస్తున్నారని కొనియాడారు. త్వరలో అంబటి సత్రం రహదారిని కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. సమస్యలు లేని నగరంగా రూపొంది ంచడమే కోలగట్ల ఆశయమని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి , నగరపాలక సంస్థ ఇఇ కె.శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కుమ్మరిగంటి శ్రీనివాసరావు, ప్రకాశ్ సిల్క్ అధినేత ఉప్పు ప్రకాశరావు, కాపుగంటి ప్రకాష్ పాల్గొన్నారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం

ప్రజాశకి-విజయనగరం టౌన్

పిల్లలకు చదువుతోపాటు క్రీడలూ అవసరమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. ఆడపిల్లలకు ఆత్మరక్షణ కోసం కరాటే వంటి వాటిలో ప్రతిభ ఉంటే తన లాంటి తల్లులకు ధైర్యంగా ఉంటుందని చెప్పారు. నగరంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్- (జూనియర్స్) ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్, బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు తదితరులతో కలిసి ఆమె ఆదివారం ప్రారంభించారు. కేసలి అప్పారావు మాట్లాడుతూ కరాటే వంటి ఆత్మ రక్షణ క్రీడలు బాలల శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

సైకో పాలనకు చరమగీతం పాడాలి

చంద్రబాబు అరెస్టుపై కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-విజయనగరంకోట


రాష్ట్రంలో సైకో పరిపాలనకు ప్రజలు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆదివారం 'బాబుతో నేను' కార్యక్రమంలో భాగంగా గంటస్తంభం వద్ద చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలు,వాహన దారులతో పోస్ట్ కార్డులపై సంతకాల సేకరణ చేశారు. మరోవైపు చంద్రబాబు అరెస్టుకు నిరసనగా విజయనగరం నియోజకవర్గ టిడిపి నాయకులు ఆధ్వర్యంలో స్థానిక అశోక్ బంగ్లా వద్ద నిరసన దీక్షలు ఆదివారం కొనసాగాయి. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బొబ్బిలిలో 19వ రోజు ఆదివారం రిలే దీక్షలు కొనసాగాయి. దీక్షలను టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, సుంకరి సాయిరమేష్ ప్రారంభించారు. దీక్షలలో చిరు వ్యాపారులు కూర్చుని మద్దతు ప్రకటించారు.

వేపాడ : శృంగవరపుకోట పట్టణంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం దీక్షల్లో టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, నాయకులు గొంప తేజ, కండిపల్లి ఈశ్వరమ్మ, కండిపల్లి అచ్చియమ్మ, తదితరులు కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు ఇందుకూరు శ్రీనివాసరాజు, బంగారునాయుడు, జి.రమణ, గొర్లె నాగరాజు, బానాది ఎంపిటిసి గొంప తులసి, సేనాపతి గణేష్ సిరికి రమణ పాల్గొన్నారు.



వేపాడ.. దీక్షా శిబిరంలో కూర్చున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, వేపాడ మండల నాయకులు


డెంకాడ.. నాతవలసలో దీక్షలు చేస్తున్న టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు, నాయకులు, కార్యకర్తలు

నెల్లిమర్ల : నెల్లిమర్లలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్ రావు, సువ్వాడ రవి శేఖర్, కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, కర్రోతు సత్యనారాయణ, పతివాడ అప్పల నారాయణ, పోతల రాజప్పన్న తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : చంద్రబాబును విడుదల చేయాలని టిడిపి ఆధ్వర్యాన నాతవలసలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, పూసపాటిరేగ మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, కలిదిండి పాణీరాజు, పి.శివరామ విద్యాసాగర్ నాయుడు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, కొర్నాన ఆదిబాబు, కొయనేని రమణ, నాతవలస సర్పంచ్ ఆవాల లక్ష్మి పాల్గొన్నారు.

గరివిడి : చీపురుపల్లిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున ఆధ్వర్యాన చేపట్టిన దీక్షల్లో ఆదివారం గరివిడి మండలం తోండ్రంగి గ్రామ నాయకులు బలగం వెంకటరావు ఆధ్వర్యంలో నలుపు దుస్తులు ధరించి కూర్చున్నారు. కార్యక్రమంలో రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, సారేపాక సురేష్ బాబు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : మండలంలోని పోలిపల్లి గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో చంద్రబాబు అరెస్టు అక్రమమని కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, నాయకులు కర్రోతు రాజు, చింతపల్లి రామకృష్ణ, రామునాయుడు, సిరగం శ్రీను, విజయ్, ఆనంద్, మామిడి బాలకృష్ణ, చందక శ్రీను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయికి పథకాలను తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలని క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కడుకండి శ్రీనివాసరావు జెసిఎస్ కన్వీనర్లకు సూచించారు. ఆదివారం పట్టణంలోని వైసిపి నూతన కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల జెసిఎస్ కన్వీనర్లు, సోషల్‌మీడియా ప్రతినిధులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విధానాలను ప్రజల్లో క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత సోషల్ మీడియా ప్రతినిధులపై ఉందని తెలిపారు. రానున్నవి ఎన్నికల రోజులని, ప్రతిఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

చిన్నారికి సాయం

ప్రజాశక్తి-భోగాపురం


చిన్నారితో జనసేన నాయకురాలు లోకం మాధవి

ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న చిన్నారికి నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన నాయకులు లోకం మాధవి చికిత్సకయ్యే ఖర్చు మొత్తం భరిస్తానని హామీనిచ్చారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఇటీవల విశాఖలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గజపతినగరం నియోజకవర్గానికి చెందిన దీప అనే మహిళ తన కుమార్తె వారుణ్య ఊపిరితిత్తల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్య విన్న పవన్ కళ్యాణ్ ఆ చిన్నారికి సాయం అందించాలని లోకం మాధవికి సూచించారు. ఆయన ఆదేశాల మేరకు ఆ చిన్నారిని ఆదివారం ఆసుపత్రికి తీసుకువెళ్లి చూపించారు. ఈ చిన్నారికి అయ్యే ఆసుపత్రి ఖర్చు పూర్తిగా భరిస్తానని ఆమె తల్లికి మాధవి హామీ ఇచ్చారు.

మొక్కలు నాటి సంరక్షించండి

ప్రజాశక్తి-విజయనగరం

పర్యావరణ సమతుల్యత కోసం మన కుటుంబ సభ్యుల పుట్టినరోజులు లేదా పెళ్లి రోజులు వంటి ప్రత్యేకమైన రోజులలో ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక్క మొక్కను నాటి ఆ మొక్కను సంరక్షిస్తే పర్యావరణంలో సమతుల్యత ఏర్పడి ఆరోగ్యకరమైన వాతావరణ ఏర్పడుతుందని జెవివి పట్టణ అధ్యక్షుడు షిణగం శివాజీ పిలుపునిచ్చారు. ఆదివారం శివాజీ సతీమణి సైలాడ శ్రీదేవి పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక బొబ్బాదిపేట ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఒక మామిడి, ఒక జామ మొక్కను నాటారు.


రోడ్డు మలుపుల్లో జెసిబితో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న పోలీసులు

మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రహదారి మలుపుల వద్ద జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ పి.నారాయణరావు వాహనదారులకు సూచించారు. ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక జ్యూట్‌మిల్ బ్రిడ్జి వద్ద రహదారి మలుపుల్లో పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మలుపుల వద్ద అతి వేగం వల్ల తన ప్రాణంతోపాటు ఎదుటి వారి ప్రాణాలకు కూడా ముప్పు కలిగిస్తుందని, జాగ్రత్తగా వాహనాలు నడపాలని కోరారు. అతి వేగంగా నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసుల పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని సవరవల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ కారణంగా పలు గ్రామాలకు సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఇ మస్తాన్ వలి తెలిపారు. 11 కెవి నిర్వహణలో భాగంగా సవరవల్లి, రావాడ, కౌలువాడ, తూడెం, జమ్మయ్యపేట, బసవపాలెంతోపాటు సన్ రే రిసార్ట్స్ విలేజ్, చెట్టినాడు కంపెనీకి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలంతా గమనించాలని ఆయన కోరారు.

సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-గరివిడి

కాపుశంభం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు చందక ప్రణిత, చంద్రమౌళి.. భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి స్కాప్ షిప్పింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాము, పీడీ ఉదయ్‌కుమార్, ఎస్ఎంసి చైర్మన్ దుర్గారావు, సర్పంచ్ లెంక సుశీల, లెంక శ్రీరాములు, పైల బాలరాం అభినందించారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆదివారం సంగివీధిలో అంబేద్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేసేందుకు గుర్రం జాషువా కవితలు, పద్యాలు దోహదపడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సోరు సాంబయ్య, న్యాయవాది విల్సన్ బాబా, టిడిపి నాయకులు సాయి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ద్రావణాల తయారీపై అవగాహన

ప్రజాశక్తి-గరివిడి

మండలంలోని రేగటి అగ్రహారంలో ఆదివారం రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ద్రావణాల తయారీపై యూనిట్ ఇన్‌ఛార్జి కుప్ప నాగమణి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో రైతులు ఆరోగ్యకరమైన పంటలు సాగుచేయొచ్చని వివరించారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని చెప్పారు.

గురువులకు పూర్వ విద్యార్థుల సన్మానం

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని వెలమ సామాజిక భవనంలో ఆదివారం చెలికాని విజయకుమారి జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు తమ గురువులను సన్మానించి గురుభక్తి చాటుకున్నారు. 2000-02 ఇంటర్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమను క్రమశిక్షణతో ఉత్తములుగా గురువులు తీర్చిదిద్దడంతో మంచి స్థాయిలో ఉన్నామని పూర్వ విద్యార్థులు జి.తిరుపతిరావు, కెవికె రాజు, చిన్నంనాయుడు, అచ్యుతవల్లి, వెంకటలక్ష్మి అన్నారు.

కష్టంలోనూ కలవని మనసులు

టిడిపిలో పెరుగుతున్న గ్రూపులపోరు ● అధినేత అరెస్టుకు నిరసనగా వేర్వేరు శిబిరాలు

ప్రజాశక్తి - జామి



'కలిసుంటే కలదు సుఖం' అన్నారు పెద్దలు. అలాగే కష్టం వచ్చిందంటే... బద్ధ శత్రువులైనా కలిపోవడం మానవ సహజం. కానీ తెలుగు తమ్ముళ్లకు ఇవేవీ పట్టినట్టు కనిపించడం లేదు. శృంగవపుకోట నియోజకవర్గంలో టిడిపి నాయకుల తీరును పరిశీలిస్తే... వారికి టికెట్ తప్ప పార్టీ మనుగడ ముఖ్యం అన్నట్లు కనిపించడం లేదు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జైల్లో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపడుతున్నారు. నియోజకవర్గంలో టిడిపి నాయకులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా గ్రూపుల బల ప్రదర్శనలు చేసుకుంటున్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపడుతున్న కార్యక్రమాల్లోనూ గ్రూపులుగా విడిపోయారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఎస్.కోట పట్టణంలో నిరసన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న ఎన్ఆర్ఐ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పోటీగా మరో నిరసన శిబిరాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా ప్రతి కార్యక్రమంలోనూ రెండు గ్రూపులుగా టిడిపి నాయకులు విడిపోయిన పరిస్థితి. ఎన్నికల్లో టిక్కెట్ సంగతి అటుంచితే, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కూడా గ్రూపుల పోటీలు, బల ప్రదర్శనలు ఏమిటని పార్టీ కార్యకర్తలు కలవరపడుతున్నారు. టిక్కెట్ ఎవరికి వచ్చినా, పార్టీ గెలుపే ముఖ్యమని బయటకు చెబుతున్న ఈ ఇరువురు పార్టీ కార్యక్రమాల్లో మాత్రం వర్గ విభేదాలు వీడడం లేదు.

రెండుగా చీలిపోయిన టిడిపి

శృంగవరపుకోట నియోజకవర్గం టిడిపి కంచుకోటగా చెప్పొచ్చు. అత్యధిక సార్లు గెలుపు బావుటా ఎగురవేసిన సందర్భాలు ఉన్నాయి. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోళ్ల కుటుంబానికి టిడిపి అధినాయకత్వంతో మంచి సంబంధాలు ఉన్నాయనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల పార్టీలో చేరిన ఎన్ఆర్ఐ గొంప కృష్ణ పార్టీ టిక్కెట్ కోసం గట్టిగా పట్టుబడుతున్న పరిస్థితి. ఆయనకు చంద్రబాబు కుటుంబ సభ్యుల్లో ఒకరైన భరత్ ఆశీస్సులు ఉన్నాయనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో ఎవరికి వారే టిక్కెట్ ఖాయమని చెప్పుకుంటున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఐదు మండలాల్లో పూర్వం నుంచి కలిసున్న టిడిపి నాయకత్వం రెండుగా చీలిపోయింది. జామి, ఎస్.కోట, వేపాడ, కొత్తవలస, ఎల్.కోట మండలాల నాయకులు రెండు గ్రూపులుగా నిరసన శిబిరాల్లో పాల్గొంటున్నారు. పార్టీ అధినేతతోపాటు రాష్ట్ర నాయకత్వం కష్టకాలంలో నానా అవస్థలు పడుతుంటే, ఎస్.కోటలో టిడిపి ఢీ అంటే ఢీ అంటూ కొట్టుకుంటున్న పరిస్థితి. ఇదే అధికార పార్టీకి కలిసొచ్చిన అంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే కోట టిడిపి నాయకుల తీరు మార్చుకుంటారో? లేక గ్రూపుల గోల ముదిరి పాకాన పడుతుందో అన్నది కాలమే తేల్చాల్సి ఉంది.


డిఎస్‌పి ఉదయ పావనిపై పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

డిఎస్‌పి పావనికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నూతన డిఎస్‌పి ఉదయ పావనికి స్వగ్రామం అలుగోలులో ఘన స్వాగతం లభించింది. ఇటీవల గ్రూప్-1లో పరీక్షా ఫలితాల్లో డిఎస్‌పిగా ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని, తొలిసారి గ్రామానికి రావడంతో కెల్ల ఉదయ పావని, తల్లిదండ్రులను గ్రామస్తులు సత్కరించి, ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కె.దివాకర్, ఆల్తి బాబూరావు, ఎం.భోజచక్రపాణి, కె.రమేష్ పాల్గొన్నారు.

భానుకు సత్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలికి చెందిన కార్టూనిస్టు భానును ఆదివారం పట్టణంలోని వెలమవారివీధి ఆత్మీయ సంఘం అధ్యక్షులు గంగాధర్, సభ్యులు సత్కరించారు. విజయవాడకు చెందిన హాస్యనందం పత్రిక యాజమాన్యం భానుకు టి.వెంకటరత్నం, వనజాక్షమ్మ దంపతుల స్మారక అవార్డు ప్రదానం చేయడంతో ఈ సన్మానం చేశారు.

మాతోనే సంక్షేమ పాలన

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


వేపాడ.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-వేపాడ

వైసిపి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మండలంలోని బొద్దాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ ఆరాతీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. మరోసారి సిఎంగా జగన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు, సర్పంచ్ ఎర్ర రామలక్ష్మి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పద్మ, సర్పంచ్ ఎన్.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : మండలంలోని ముచ్చర్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నిర్వహించారు. ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజా సంక్షేమ పథకాలు భవిష్యత్తులో కొనసాగాలంటే మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, బెల్లాన త్రినాథరావు, మండల సురేష్ తదితరులు పాల్గొన్నారు.


గజపతినగరం.. వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

11 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి'

ప్రజాశక్తి-డెంకాడ

ఈ నెల 11 నుంచి ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి? కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు ఎంపిటిసిలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. సుపరిపాలన అందిస్తూ దేశానికే మన రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని తెలిపారు. అలాంటి పరిపాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌ను సిఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

రోడ్డు బాగుచేయాలని జనసేన దీక్ష

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని పూల్‌బాగ్ రోడ్డు బాగు చేయాలని ఆదివారం జనసేన ఆధ్వర్యంలో రాజా కళాశాల వద్ద ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి మాట్లాడుతూ పూల్‌బాగ్ రహదారి పాడైపోయి ప్రమాదాలు సంభవిస్తున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రహదారి బాగుచేసేందుకు మున్సిపల్ సాధారణ నిధులు కేటాయించినా ఎందుకు పనులు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. దీక్షకు టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, సుంకరి సాయిరమేష్, కాకల వెంకటరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి గ్రామంలో ఆదివారం హరిత విప్లవకారుడు ఎంఎస్ స్వామినాథన్‌కు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నారు జనార్దనరావు, అప్పలనాయుడు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పెనుమార్పులకు నాంది పలికిన మహనీయుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అని కొనియాడారు. స్వామినాథన్ ఆశయాలు, లక్ష్యాలు నెరవేరాలంటే క్షేత్రస్థాయిలో రైతులను ఐక్యపరుస్తూ పాలకులపై ఒత్తిడి తీసుకురావడం ద్వారానే సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలవలస రామినాయుడు, మాచర్ల శ్రీనివాసరావు, ధర్మాన రాములు, సేనాపతి భీమారావు రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైతుకు పాము కాటు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని చందులూరు పంచాయతీ శివారు కొత్త చందులూరు గ్రామానికి చెందిన రైతు రెడ్డి సన్యాసినాయుడు ఆదివారం పాముకాటుకు గురయ్యారు. తన పొలంలో కలుపు మొక్కలు తీసేందుకు వెళుతుండగా ఆయన కుడి కాలిపై పాము కాటేసింది. వెంటనే కుటుంబ సభ్యులు లక్కవరపుకోట పిహెచ్‌సికి తరలించారు. అక్కడి సిబ్బంది ప్రథమ చికిత్స చేసి, శృంగవరపుకోట సిహెచ్‌సికి రిఫర్ చేశారు. సిహెచ్‌సిలో ఆయన చికిత్స పొందుతున్నారు.

లారీ బోల్తా

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడులో కోళ్లఫారాలకు దాణా తీసుకొస్తున్న లారీ ఆదివారం ఆ గ్రామ సమీపంలో చెరువు వద్ద బోల్తా పడింది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించబోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికేమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.


పొలంలో బోల్తా పడిన లారీ

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం


ఫ్యాన్లు అందజేస్తున్న మేమున్నాం సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయల వసతి గృహంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం రెడ్ క్రాస్ సొసైటీ సెక్రటరీ కె. సత్యం ఆధ్వర్యాన నిర్వహించారు. ముందుగా సత్యం వృద్ధులందరికీ మిఠాయిలు, పండ్లు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యమంటే భావితరాలకు అనుభవాల నిధి అని, సమాజంలో ఉండే నేటి యువతీయువకులు.. వృద్ధులు జీవిత మార్గ నిర్దేశకులని తెలుసుకోవాలని అన్నారు. వృద్ధుల హక్కుల కోసం, వారికి ఆరోగ్య సూత్రాలు, మెలుకువలను తెలిపారు.కార్యక్రమంలో పట్టణ నిరాశ్రయుల భవనం మేనేజర్ త్యాడ రామకృష్ణారావు(బాలు), రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ గౌరీ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్లు వితరణ

నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో వృద్ధులు, నిరుపేద పిల్లలు ఆశ్రయం పొందుతున్న నవజీవన్ ఆశ్రమానికి 'మేమున్నాం' స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆదివారం ఫ్యాన్లు వితరణగా అందించారు. ముఖ్య అతిథి తిరుపతి మాట్లాడుతూ మేమున్నాం సంస్థ చేపడుతున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో కంది మూర్తి, లత, డోకి చంద్రశేఖర్, శ్రీనివాస్, దుర్గ పాల్గొన్నారు.